

గిరిజన కార్పొరేషనా..మజాకా

తిరుపతి రుయాలో ఏర్పాటైన గిరిజన కార్పొరేషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పిలుపునిచ్చారు. - 8లో



ఎండీఎం నిర్వాహకుల పొట్ట కొట్టొద్దు

మధ్యాహ్న భోజన నిర్వాహకుల పొట్టకొట్టడం దారుణమని సీఐటీయూ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు నిరసన చేపట్టారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా)	సహర్ గురువారం (ఉ)
తిరుపతి	6-24	5-07
గూడూరు	6-19	5-03

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 827మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఇంగ్లిష్ పేపర్-1 పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 31,900 మంది, ఒకేషనల్‌లో 1,394 మంది మొత్తం 33,294 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 827మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఇంగ్లిష్ పేపర్-2 సబ్జెక్టులో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ పేర్కొన్నారు.

బస్సు పాస్ కేంద్రం మార్పు



బస్సు పాస్‌ల కేంద్రానికి మరమ్మతులు

తిరుపతి అర్బన్: ఏడుకొండల బస్టాండ్‌లోని బస్సు పాస్ కేంద్రాన్ని శ్రీనివాస బస్టాండ్‌లోని 29వ ప్లాట్‌ఫాం వద్దకు మార్పు చేసినట్లు తిరుపతి డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడుకొండల బస్టాండ్‌లోని బస్సు పాస్ కేంద్రం మరమ్మతుల నేపథ్యంలో నాలుగు రోజుల పాటు శ్రీనివాస బస్టాండ్‌లో ప్రత్యామ్నాయ బస్సుపాస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మరమ్మత్తుల అనంతరం తిరిగి ఏడుకొండల బస్టాండ్‌కి బస్సు పాస్ కేంద్రాన్ని మార్పు చేస్తామని స్పష్టం చేశారు.

చదువుతో పాటు నైపుణ్యం ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎడ్యుకేషనల్ అడ్వైజర్ కేవీఎస్.ప్రకాష్

తిరుపతి ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు కమ్యూనికేషన్, లైఫ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని ఎడ్యుకేషనల్ అడ్వైజర్ కేవీఎస్.ప్రకాష్ తెలిపారు. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫైనల్ ఇయర్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మంగళవారం వ్యవస్థాపకత స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ఆయన పాల్గొని డిప్లొమో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్లొమో పూర్తయ్యాక ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, విభాగాధిపతులు జీఎస్.రాధా, డాక్టర్ ఎస్వీ.గౌరీశంకర్ పాల్గొన్నారు.

సెలవులో కలెక్టర్

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మూడు రోజులు సెలవుపై వెళ్లారు. సోమ, మంగళ, బుధవారాల్లో ఆయన అందుబాటులో ఉండరు. తిరిగి గురువారం (ఈనెల 6) నుంచి అందుబాటులోకి రానున్నారు. ఈ క్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా వ్యవహరించనున్నారు.

ఆర్‌సీరెడ్డి డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మేళా

తిరుపతి అర్బన్/తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి రూరల్ పరిధిలోని ఆర్‌సీరెడ్డి డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్. లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి జాబ్ మేళాను నిర్వహిస్తామని వెల్లడించారు. పదోతరగతి నుంచి ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదువుకున్న యువతీయువకులు అర్హులని తెలిపారు. ముందుగా ఇంటర్వ్యూలకు వచ్చే నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 807491 9939 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కూటమి ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో ఉపాధ్యాయులు అష్టకష్టాలు పడుతున్నారు. ఆఘమేఘాలపై విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో అన్నీ తప్పులే ఉండడంపై రగిలిపోతున్నారు. ఒకపక్క పరీక్షలు ముంచుకొచ్చిన వేళ తరగతులు నిర్వహించకుండా తప్పులు సరిద్దుకోవడానికి డీఈఓ కార్యాలయానికి రావాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.



సీనియారిటీ జాబితా కసరత్తు చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది (ఫైల్)

తప్పులు..తిప్పలు!

టీచర్ల సీనియారిటీ జాబితాలో అన్నీ తప్పులే

- అవస్థల్లో చిత్తూరు, తిరుపతి జిల్లాల అయ్యోర్లు
- చిత్తూరు డీఈఓ కార్యాలయానికి పరుగులు
- ప్రభుత్వ పాఠశాలల్లో కుంటుపడుతున్న చదువులు
- కూటమి ప్రభుత్వం పై భగ్గుమంటున్న ఉపాధ్యాయులు

తిరుపతి, చిత్తూరు జిల్లాల సమాచారం	
చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు	2,436
తిరుపతి జిల్లాలోని పాఠశాలలు	2,444
స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు	8,435
విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్లు	7,534
స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు	901
ఎస్జీటీ పోస్టులు	8,295
విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీలు	6,443
ఎస్జీటీ ఖాళీ పోస్టులు	1,852
పనిచేస్తున్న హెచ్ఎంలు	408

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలో 2,436, తిరుపతి జిల్లాలో 2,444 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లాలోని పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 1,41,217, తిరుపతి జిల్లాలో 1,87,444 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ కేడర్లలో 24,836 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా కసరత్తును గత రెండు నెలలుగా నిర్వహించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టిస్) ఆధారంగా సిద్ధం చేశారు. ఈ కసరత్తు పూర్తి చేశాక ఈ నెల 3వ తేదీన కేడర్ల వారీగా జాబితాను విద్యాశాఖ అధికారులు వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఆ జాబితాను పరిశీలించుకున్న తర్వాత చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని టీచర్లు తమ వివరాలన్నీ తప్పుల తడకగా ఉన్నట్లు గగ్గోలు పెడుతున్నారు.

అన్నీ తప్పులే

అన్ని మేనేజ్‌మెంట్ల సీనియారిటీ జాబితాల్లో తప్పులే ఉన్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. స్కూల్ అసిస్టెంట్ సీనియార్టీ జాబితాలను డీఎస్సీ, పుట్టిన తేదీల ఆధారంగా పొందుపరచడంతో సీనియర్, జూనియర్ అనే వ్యత్యాసం వచ్చినట్లు గగ్గోలు పెడుతున్నారు. ప్యానల్ సీనియారిటీ జాబితాలను పాటించకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు ఏర్పడినట్లు టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పుల సవరణకు టీచర్లు చిత్తూరు డీఈవో కార్యాలయానికి వచ్చి అభ్యంతరాలు తెలియజేయాలని చెప్పడం బాధాకరమని పలువురు మండిపడుతున్నారు.

సమస్యలు ఇలా..

- ఉద్యోగోన్నతుల సందర్భంగా రెండు, మూడు రకాల తేదీలను పొందుపరచడంతో సీనియారిటీ జాబితాలో లోపాలు దొర్లాయి.
- 2002 అక్టోబర్ 31వ తేదీన ఉద్యోగోన్నతి పొందిన వారిలో వివిధ తేదీలను నమోదు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- డీఎస్సీ 2000లో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికై, 2001 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారి సీనియారిటీలో రెగ్యులర్ వారికంటే జాబితాలో ముందున్నారు.
- డీఎస్సీ 2018లో సోషియల్ (ఎస్ఏ) టీచర్లు వివిధ తేదీలలో జాయిన్ కావడంతో వారి సీనియారిటీ జాబితాలో వ్యత్యాసం కనిపిస్తోంది.
- 2002 ఆన్‌లైన్ టీచర్ల నియామక ప్రకారం ఆ కేడర్‌లో సీనియారిటీ పొందుపరచాలి.
- 2008 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల సీనియారిటీ కొన్ని మండలాల్లో ఉత్తర్వుల ప్రకారం అమలు చేయకపోవడంతో అసమగ్రత ఏర్పడింది.

తప్పులను తొలగించాలి



విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన సీనియారిటీ జాబితాలో దొర్లిన తప్పులను సవరించాలి. ఈ సీనియారిటీ జాబితాలో 90 శాతం తప్పులున్నాయి. ఇలాంటి జాబితాలు విడుదల చేయడం బాధాకరం. – జీవీరమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఎవరికి ఉపయోగం



విద్యాశాఖ అధికారులు విడుదల చేసిన తప్పుల తడక సీనియారిటీ జాబితా ఎవరికి ఉపయోగమని ప్రశ్నిస్తున్నాం. ఇలాంటి జాబితాల వల్ల సమయం వృథా తప్ప ఒరిగేదేమి ఉండదు. సీనియర్ల స్థానంలో జూనియర్లు రావడం ఆందోళన కలిగిస్తోంది. – ముత్యాలరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా

సీనియారిటీకి తిలోదకాలు



సీనియారిటీకి తిలోదకాలు ఇచ్చి జాబితాలను సిద్ధం చేశారు. రెండుమూడేళ్ల తర్వాత ఉద్యోగోన్నతి పొందిన వారు సీనియర్లుగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. – రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్

ఇది కరెక్ట్ కాదు



టీచర్లను ఇబ్బందులు పెట్టడం కరెక్టు కాదు. అధికారులు కసరత్తులో తప్పులు చేసి టీచర్లను వేధిస్తున్నారు. తప్పిదాలను తొలగించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల టీచర్లను చిత్తూరుకు వచ్చి నేరుగా అభ్యంతరాలు ఇవ్వాలని చెప్పడం సబబుకాదు. – బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీవారి తెప్పోత్సవాలకు పటిష్ట భద్రత

తిరుమల: తిరుమలలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు జరగబోయే తిరుమల శ్రీవారి తెప్పోత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుమలలోని పోలీస్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. దీనికి ముందు ఆయన తెప్పోత్సవాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ స్వామి వారి దర్శనమయ్యేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి కెమెరాను కూడా తప్పనిసరిగా చెక్ చేయాలన్నారు. సోమవారం సాయంత్రం అదృశ్యమైన చిన్నారి దీక్షను గంటల వ్యవధిలోనే గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. తిరుమల ఏఎస్పీ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



కోనేరు పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

హాల్ టికెట్లు అందక పరీక్షకు దూరం

- కళాశాల ఎదుట తల్లిదండ్రులు, విద్యార్థుల ఆందోళన

తిరుపతి ఎడ్యుకేషన్ : హాల్‌టిక్కెట్లు అందక తొమ్మిది విద్యార్థులు ఇంటర్ పరీక్షలకు దూరమైన ఘటన తిరుపతి బైరాగిపట్టెడలో చోటు చేసుకుంది. వరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా, జీడీనెల్లూరు నియోజకవర్గం, పెనుమూరులో గత కొన్నేళ్లుగా ఎస్వీ జూనియర్ కళాశాల పేరుతో ప్రైవేటు జూనియర్ కళాశాలను నిర్వహించారు. అయితే 2024-25 విద్యాసంవత్సరంలో ఈ కళాశాలను తిరుపతి సమీపం రాయలచెరువుకు సంబంధించిన ఓం ప్రకాష్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. అదే పేరుతో బైరాగిపట్టెడ వద్ద ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కళాశాలను ఏర్పాటుచేసి అడ్మిషన్లు చేపట్టాడు. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో గతంలో ఆర్ఐఓ ఆ కళాశాలను సందర్శించి షోకాజు నోటీసులను అందించారు. దీంతో ఎస్వీ జూనియర్ కళాశాల అనే బోర్డును తీసేసి కోచింగ్ సెంటర్ అనే బోర్డును ఏర్పాటుచేసుకున్నాడు. కొన్నాళ్లకు ఓమ్ ఎస్‌వీవీ జూనియర్ కళాశాలగా బోర్డును ఏర్పాటు చేశాడు. దాదాపుగా 86 మంది మొదటి సంవత్సరం విద్యార్థులకు పెనుమూరు ఎస్వీ జూనియర్ కళాశాల పేరుతోనే పరీక్ష ఫీజులు కట్టారు. దీంతో ఈ విద్యార్థులందరూ చిత్తూరుకెళ్లి పరీక్షలు రాస్తున్నారు. అయితే వీరిలో 9 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాల ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. పోలీసులు, ఆ కళాశాల యాజమాన్యం అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. జూన్‌లో ప్రైవేటుగా పరీక్ష రాసే వెసులుబాటు ఉందని, దీనివల్ల విద్యార్థులకు ఎటువంటి విద్యాసంవత్సరం నష్టం ఏర్పడదని వారికి సర్దిచెప్పడంతో ఆందోళనను విరమించారు.



తిరుపతి బైరాగిపట్టెడలో ఏర్పాటుచేసిన ఓం ఎస్‌వీవీ జూనియర్ కళాశాల

తొక్కిసలాట ఘటనపై 17న విచారణ

తిరుపతి అర్బన్: టీటీడీ వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా జనవరి 8న తిరుపతిలోని బైరాగిపట్టెడ పద్మావతి పార్కులో జరిగిన తొక్కిసలాట ఘటనపై జ్యుడీషియల్ విచారణ కొనసాగుతోంది. విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో విచారణ చేపడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 17న టీటీడీ ఈఓ శ్యామలారావు, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలెక్టరేట్‌లో విచారణ చేపట్టనున్నారు. ఆ మేరకు ఇప్పటికే వారికి సమాన్లు అందించారు.

అలిగితివా సఖీ!

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం పల్లకీసేవ నయనానందకరంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో శ్రీకాళహస్తి పట్టణంలో నందడి నెలకొంది. పార్వతీదేవి అర్ధాంగిగా చేసుకుని అర్ధనారీశ్వరుడు అయ్యాడు శ్రీకాళహస్తీశ్వరస్వామి. కాగా గంగను శిరస్సుపై ఉంచడాన్ని సహించని పార్వతీదేవి ఆయనపై అలిగి పల్లకీలో ముందుగా వెళుతుండగా ఆమెను వెంబడిస్తూ సర్వేశ్వరుడు రావడం ఈ ఉత్సవం విశేషం. అలిగి వెళుతున్న అమ్మవారి ముందు దర్పణాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అద్దంలో కనిపించే అమ్మవారి సుందర రూపాన్ని చూసి పునీతులయ్యారు. కాగా బుధవారం ఏకాంత సేవ జరగనుంది. - శ్రీకాళహస్తి



పల్లకీ సేవకు పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) దర్పణంలో అమ్మవారి ప్రతిబింబం

బీమా రంగ భవిష్యత్‌ను కాపాడండి

- తిరుపతి ఎంపీకి విన్నవించిన ఎల్ఐసీ ఏజెంట్లు



ఎల్ఐసీ ఏజెంట్ల శాంతియుత ప్రదర్శనకు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు తెలుపుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం: బీమా రంగ భవిష్యత్‌ను కాపాడాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సూచించారు. ఎల్ఐసీ ఏజెంట్లు ఈ నెల 19వ తేదీన ఢిల్లీలోని రామలీలా మైదానంలో శాంతియుత ప్రదర్శన చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ ఏజెంట్లు మంగళవారం తిరుపతి ఎంపీ కార్యాలయంలో ఎంపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. శాంతియుత ప్రదర్శనకు మద్దతు తెలపాలని కోరారు. ఎల్ఐసీ, ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చిన మార్పులు పాలసీదారులు, బీమా పరిశ్రమ దేశ వ్యాప్తంగా 30 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో భారత జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19న ఢిల్లీలో శాంతియుత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎంపీకి వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గతంలో కూడా ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పార్లమెంటులో ప్రస్తావించిన విషయాన్ని వారికి గుర్తుచేశారు. ఢిల్లీలో నిర్వహించనున్న శాంతియుత ప్రదర్శనకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

నేటి నుంచి సమ్మె ఉధృతం

తిరుపతి సిటీ: గౌరవ వేతనం పెంచాలంటూ పశు వైద్య విద్యార్థులు చేస్తున్న నిరవధిక సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా మంగళవారం చేతులు, కాళ్లకు స్వతహాగా బేడీలు వేసుకుని న్యాయదేవత ముందు తమగోడును వెళ్లబోసుకున్నారు. తమ ఆకలి కేకలు వర్సిటీ అధికారులు, ఇటు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బుధవారం నుంచి సమ్మెను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

హాస్టల్స్ బంద్ చేస్తాం

వెటర్నరీ జూడాలు సమ్మెను విరమించని నేపథ్యంలో వర్సిటీలోని హాస్టల్స్‌ను మూసివేస్తామని మరో వైపు అధికారులు బెదిరిస్తున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులకు ఫిర్యాదులు చేస్తామని సైతం అధికారులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం.



వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న జూడాలు

ప్రజారోగ్యమే ధ్యేయం

చంద్రగిరి: ప్రజారోగ్యమే ధ్యేయంగా పనిచేసి, ఆరోగ్య సమస్యలు రాకుండా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణనాయక్ సూచించారు. మంగళవారం ఆయన అసిస్టెంట్ డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీకృష్ణతో కలసి పట్టణంలోని సచివాలయం-2లోని హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సెంటర్లో కనీస సౌకర్యాలు లేవని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ చంద్రగిరి సర్పంచ్ రూపరామ్మూర్తికి ఫోన్ చేసి సమస్యను వివరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని సర్పంచ్ ఆయనకు తెలిపారు. అనంతరం హెల్త్ సెంటర్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ

నిత్యం ఇలా.. ఆరోగ్యం ఎలా?





రేణిగుంట మేజర్ పంచాయతీలో 90 మందికి పైగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరు ఉదయం 5 గంటల నుంచి పంచాయతీలోని పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమవుతుంటారు. ప్రజలు స్వచ్ఛమైన జీవనం సాగించాలంటే వీరు రోడ్లు, కాలవలు శుభ్రం చేయడం పరిపాటి. అలాంటి కార్మికుల పట్ల పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కార్మికులు ఎటువంటి మాస్కులు, చేతికి గ్లౌజులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. కొందరికి రబ్బర్ గ్లౌజులు ఇచ్చినా ఫలితం లేకుండా పోతోంది. అవి లూజుగా ఉండడంతో జారిపోతున్నాయి. దీంతో కార్మికులు వాటిని పక్కన పెట్టేశారు. కొందరైతే ప్లాస్టిక్ కవర్లను చేతికి కట్టుకొని పనులు చేస్తున్నారు.

– రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)



చేతికి ప్లాస్టిక్ కవర్ చుట్టుకుని పారిశుద్ధ్య పనులు



వట్టి చేతులతోనే..



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.89,240
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,086

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,200
రిటైల్ వెండి గ్రాము	రూ.101.20

గిరిజన కార్పొరేషనా.. మజాకా

- రుయాలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- జనసేన నేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు
- లబోదిబోమంటున్న సమీప దుకాణదారులు


గిరిజన కార్పొరేషన్ దుకాణంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన హోటల్

తిరుపతి తుడా: తిరుపతి రుయాలో గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్‌కి చెందిన ఉత్పత్తుల విక్రయాలకు అనుమతిచ్చారు. ఇప్పుడు ఈ దుకాణం రావడంతో రుయాలో టెండర్లు ద్వారా దక్కించుకున్న దుకాణదారులకు కంట్లో నలుసు పడ్డట్టయ్యింది. పక్కన ఉన్న ఐదు అడుగుల బంక్ నిర్వాహకుడు రుయాకు నెలకు రూ.1.3 లక్షలు అద్దె చెల్లిస్తుండగా గిరిజన కార్పొరేషన్ పేరుతో ఇతర ఉత్పత్తులు విక్రయిస్తున్న వ్యక్తి కేవలం రూ.20 వేల లోపేలోపు అద్దె చెల్లిస్తున్నారు. ఇంత భారీ వ్యత్యాసం ఉన్నప్పుడు గిరిజన కార్పొరేషన్ దుకాణాన్ని మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఏకంగా హోటల్‌నే పెట్టేశారు

గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ దుకాణంలో గిరిజన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలి. అయితే రుయాలో ఏర్పాటైన ఈ దుకాణంలో జంక్ ఫుడ్స్‌తో పాటు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం ఇతర అల్పాహారాలు, రాత్రి పూట టిఫిన్ విక్రయిస్తున్నారు. అలాగే కూల్ డ్రింక్స్ వంటివి విక్రయిస్తున్నారు.

నేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు

రుయా ఆస్పత్రిలో గిరిజన కో ఆపరేటివ్ దుకాణం అనుమతులు మొదలు స్థలం కేటాయింపు, అద్దె ఖరారు, ఆపై విక్రయాల వరకు అంతా వివాదంగా మారింది. జనసేన నేతల ఒత్తిడికి అధికారులు లొంగిపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థలం మార్పే క్రమంలో జనసేన నేతలు అధికారులపై ఒత్తిడి తెచ్చి నెలకు రూ.20 వేల లోపే అద్దెను నిర్ణయించారు. గిరిజన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాల్సి ఉండగా ఇతర ఉత్పత్తులతో పాటు ఏకంగా హోటల్ నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గిరిజన కార్పొరేషన్ దుకాణానికి నిబంధనలతో కూడిన అనుమతులు ఇచ్చాం. ఆ మేరకు విక్రయాలు జరపాలి. ఈ దుకాణాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించి నోటీసులు జారీచేస్తాం. అప్పటికీ స్పందించకుంటే తగిన చర్యలు తీసుకుంటాం. దుకాణంలో ఎమ్మార్పీకే విక్రయాలు జరపాలి. లేని పక్షంలో దుకాణాన్ని సీజ్ చేస్తాం.

– డాక్టర్ రవిప్రభ, రుయా సూపరింటెండెంట్

పవన్‌కల్యాణ్ ఆఫీస్ నుంచి ఫోన్లు వస్తున్నాయ్!

- రాజీకి రావాలని.. నేను వెళ్లకూడదని నిర్ణయించుకున్నా
- న్యాయం జరిగేవరకు కిరణ్‌రాయల్‌పై పోరాడుతూనే ఉంటా
- తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జనసేన నేత కిరణ్ రాయల్ బాధితురాలు లక్ష్మి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: 'కాంప్రమైజ్ రావాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆఫీస్ నుంచి ఫోన్లు వస్తున్నాయి. విజయవాడ వచ్చి కలవాలని చెబుతున్నారు. కానీ నా పిల్లల భవిష్యత్ కోసం నేను వెళ్లకూడదని అనుకుంటున్నాను' అని తిరుపతి జనసేన ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ బాధితురాలు లక్ష్మి వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభిమాని కిరణ్ రాయల్ తనను నమ్మించి ఆర్థికంగా, శారీరకంగా వాడుకుని మోసం చేశారంటూ తిరుపతికి చెందిన లక్ష్మి పలుమార్లు మీడియా ఎదుట తన ఆవేదనను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తన వద్ద తీసుకున్న నగదు, బంగారు నగలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమె తన విషయం పది మందికి తెలిసేలా చేసిందనే కోపంతో జనసేన నేత కిరణ్ రాయల్ లక్ష్మికి ఫోన్‌చేసి తీవ్ర స్థాయిలో బెదిరింపులకు గురిచేసిన విషయాలను ఆడియో రూపంలో బయట పెట్టారు. ఆ తరువాత కిరణ్ రాయల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కిరణ్ రాయల్‌కు సన్నిహితంగా మెలిగే ఓ సీఐ రంగంలోకి దిగి ఇద్దరి మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. అందులో భాగంగా లక్ష్మి మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి పలు విషయాలను వెల్లడించింది.

రాజకీయంగా.. ఆటబొమ్మలా వాడుకున్నారు

తనకు న్యాయం చేస్తానని కిరణ్ రాయల్ ఇవ్వాల్సిన డబ్బులు ఇప్పిస్తానంటూ తిరుపతి జిల్లా జనసేన అధ్యక్షుడు ఏడాది క్రితం తన వద్దకు వచ్చి వీడియోలు, ఆడియోలు తీసుకున్నాడని లక్ష్మి బయటపెట్టారు. ఆ తర్వాత అవన్నీ సోషల్ మీడియాలో ఎలా ప్రత్యక్షమయ్యాయో తనకు తెలియదన్నారు. తనను రాజకీయంగా ఆటబొమ్మలా వాడుకున్నారని ఆమె వాపోయారు. ప్రస్తుతం ఎస్వీయూ పోలీసు అధికారులు తన సమస్యను పరిష్కరించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఇంతటితో సమస్యకు ముగింపు పలకాలనే ఉద్దేశంతో, తన కుమారుల సూచనల మేరకు మీడియా ముందుకు వచ్చి వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇకనైనా తనను రాజకీయంగా వాడుకోవద్దని జనసేన నేతలను వేడుకున్నారు. తన వెనుకాల ఏ రాజకీయ పార్టీ లేదని, అయితే జనసేన వాళ్ల మధ్య ఏముందో తనకు తెలియదన్నారు. తన వద్ద నుంచి జనసేన జిల్లా అధ్యక్షుడు ఆడియో, వీడియోలు తీసుకున్న వివరాల్ని పోలీసులకు తెలియజేసినట్లు వెల్లడించారు. తన వెనుక వైఎస్సార్‌సీపీ నేతలున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. లక్ష్మికి కిరణ్ రాయల్ ఇవ్వాల్సిన డబ్బును తిరిగి ఇస్తానని కుమారులకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

క్లుప్తంగా

రూ.1.82 కోట్లకు ఐపీ

తిరుపతి లీగల్: రేణిగుంట, వసుంధర నగర్‌కు చెందిన పసల శ్రీనివాసులు తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఒక కోటి 82 లక్షల రూపాయలకు ఐపీ దాఖలు చేసినట్టు ఆయన తరపు న్యాయవాది రాయపాటి గజేంద్ర తెలిపారు. పిటిషన్‌లోని వివరాల మేరకు... పిటిషనర్ పసల శ్రీనివాసులు శీను ఫుడ్స్ పేరుతో వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారంలో తీవ్ర నష్టాలు వచ్చాయి. దీనికితోడు అతని తండ్రికి క్యాన్సర్ చికిత్స కోసం సొమ్మును కొంతమంది వద్ద అప్పుగా తీసుకున్నాడు. 2019లో ఊరగాయలు, బేకరీ వస్తువులకు ఆర్డర్ వచ్చింది. అతను అన్నీ తయారు చేసిన తర్వాత కరోనాతో కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించింది. వ్యాపారంలో తీవ్రంగా నష్టాలు రావడం, రుణదాతల వేధింపులు ఎక్కువ కావడంతో రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఐపీని దాఖలు చేస్తున్నట్టు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నాడు. 33 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా పేర్కొన్నాడు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న టిక్కెట్టు బుకింగ్ కార్యాలయం వద్ద సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు వయస్సు గలిగిన వ్యక్తి మంగళవారం మృతి చెందినట్టు జీఆర్‌పీ ఓపీ ఎస్‌ఐ వై.చెన్నకేశవ తెలిపారు. అయితే ఆయన నిద్రలోనే హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా ఉంటే 70134 13616, 70360 43535 నంబర్లలో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి


గాయాలతో పడి ఉన్న విద్యార్థులు

తిరుపతి క్రైమ్: శ్రీనివాస సేతుపై అధిక వేగంతో వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం.. మదనపల్లికి చెందిన రామానుజన్ నాయుడు కుమారుడు అభిరామ్ నాయుడు(20) మంగళం రోడ్‌లోని అన్నమయ్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్న సునీల్ కుమార్‌తో కలిసి కాలేజీకి సమీపంలోనే ఓ రూమును అద్దెకి తీసుకొని నివసిస్తున్నారు. అయితే వీరు తిరుచానూరు ఫ్లై ఓవర్ దగ్గర నుంచి లక్ష్మీపురం వైపు వెళుతూ సర్కిల్లో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అభిరామ్ నాయుడు మృతిచెందాడు. అదేవిధంగా వెనుక కూర్చున్న సునీల్‌కుమార్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. అత్యధిక వేగంతో వాహనం నడపడం వల్లే కంట్రోల్ చేయలేక ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జవగా.. అభిరాం నాయుడు ఫ్లైఓవర్ గోడపై వేలాడుతూ ఉండిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఉత్తమ సర్పంచ్ సుభాషిణి


ఢిల్లీలో ఉత్తమ పంచాయతీ సర్పంచ్ అవార్డును స్వీకరిస్తున్న చెర్లోపల్లి సర్పంచ్ బీ.సుభాషిణి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బీ.సుభాషిణి ఉత్తమ సర్పంచ్ అవార్డును స్వీకరించారు. దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం జరిగిన సురక్ష పంచాయతీ నేత్రీ అభయాన్ కార్యక్రమంలో భాగంగా ఆమె అవార్డును స్వీకరించారు. ఈ అవార్డును కేంద్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అందజేశారు. గత ప్రభుత్వం మద్దతుతో సర్పంచ్‌గా గెలిచిన సుభాషిణి, ఆమె భర్త బీ.శుభగిరినాయుడు పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం వల్లనే ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,683 మంది స్వామివారిని దర్శించుకోగా, 23,453 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మహిళ మెడలో చైన్ చోరీ

తిరుపతి క్రైమ్: ఓ మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన ఘటన మంగళవారం అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జునరెడ్డి కథనం.. కాటన్ మిల్ ఎస్వీఐ కాలనీలో నివాసముంటున్న రమాదేవి చిన్నపాటి ప్రావిజన్ షాప్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి కొన్ని ప్రొవిజన్స్ కొనేందుకు అక్కడికి చేరుకున్నాడు. ఆపై కొనుగోలు చేసి బిల్లు వేసే సమయంలో ఆ మహిళ మెడలో ఉన్న చైన్ లాక్కొని స్కూటీలో పారిపోయాడు. అయితే మహిళ మాత్రం చైన్ లాగే సమయంలో గట్టిగా పట్టుకోవడంతో అర్ధం చైన్ ఆమె చేతిలోనే మిగిలిపోయింది. సుమారు 16 గ్రాములకు పైగా లాక్కెళ్లినట్టు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉంది.

నమ్మకద్రోహం కేసులో వెటర్నరీ ఉద్యోగికి జైలు

తిరుపతి లీగల్: నమ్మకద్రోహం కేసులు శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన రీజనల్ అకౌంట్ ఆఫీస్ అసిస్టెంట్ కంట్రోలర్ వీ.రామమోహన్‌కు రెండేళ్ల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ జయశేఖర్, కోర్టు కానిస్టేబుల్ శేఖర్ తెలిపిన వివరాలు.. నిందితుడు రామమోహన్ శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ రాయలసీమ జోన్ రీజనల్ అకౌంట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ కంట్రోలర్‌గా పనిచేసేవాడు. సీఎఫ్ఎంఎస్ ఉద్యోగులకు చెందిన బిల్లులను బయోమెట్రిక్ ద్వారా యూనివర్సిటీకి అందజేసేవాడు. 2018 నవంబర్ ఆరో తేదీ యూనివర్సిటీకి చెందిన 81 వేల 128 రూపాయలను తన బ్యాంక్ అకౌంట్‌కు అక్రమంగా బదిలీ చేసుకున్నాడు. 2019లో తన కుమార్తెకు తెలియకుండా ఆమె పేరున అక్రమంగా ఓ తప్పుడు బ్యాంక్ అకౌంట్‌ను తయారుచేసి వివిధ తేదీలలో యూనివర్సిటీకి చెందిన రూ.9,71,620ను బదిలీ చేసుకున్నాడు. 2019 మే రెండో తేదీ యూనివర్సిటీ అకౌంటు సిబ్బంది యూనివర్సిటీకి చెందిన అకౌంట్లను పరిశీలిస్తుండగా మొత్తం 12 లక్షల 20వేల 671 రూపాయలు మాయమైనట్టు గుర్తించారు. దీనిపై వెటర్నరీ యూనివర్సిటీ అప్పటి రిజిస్టర్ డాక్టర్ డీ.శ్రీనివాసరావు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు రామ మోహన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


క్యారమ్స్ పోటీలకు హాజరైన కోచ్‌లు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

తిరుపతి సిటీ: విద్యార్థులకు క్రీడరంగంలో మంచి అవకాశాలు ఉన్నాయని, యువత అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అండ్ రెఫరీ పానెల్ కోచ్ ఎస్‌కే అబ్దుల్ జలీల్ పిలుపునిచ్చారు. ఏపీ ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్, ఆర్కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆహ్వానం మేరకు మంగళవారం తిరుపతి తుడా సర్కిల్‌లోని స్మార్ట్‌సిటీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 27వ ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్ రెండవ రోజు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ క్రీడారంగానిదేనన్నారు. ఆర్కే గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 27వ ఆల్ ఇండియా పోస్టల్ క్యారమ్స్ టోర్నమెంట్‌ను విద్యార్థులు వీక్షించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనగని రెడ్డెప్ప, రవిచంద్రబాబు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్యారమ్స్ పోటీలు

పోస్టల్ ఉద్యోగులకు జాతీయ స్థాయిలో జరుగుతున్న క్యారమ్స్ పోటీలు రెండవ రోజు రసవత్తరంగా కొనసాగాయి. తమిళనాడు, ఢిల్లీ, తెలంగాణా, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హర్యాణా జట్లు పోటాపోటీగా తలపడ్డారు. మహిళా ఉద్యోగుల క్యారమ్స్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి


మాట్లాడుతున్న అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నేత రాయపనేని హరికృష్ణ

తిరుపతి కల్చరల్: అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు కావస్తున్నా స్పందించకపోవడం దుర్మార్గమని ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ ధ్వజమెత్తారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మంగళవారం యూనియన్ జిల్లా నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించి వారి ఓట్లతో కూటమి ప్రభుత్వం అధికారం చేజిక్కించుకుందన్నారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీలతో చర్చలు జరపకపోవడం విడ్డూరమన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రాష్ట్రంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లకు, మినీ వర్కర్లకు, హెల్పర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ కక్ష సాధింపులు మానుకోవాలన్నారు. అన్ని డిమాండ్ల సాధన కోసం ఈనెల 10న విజయవాడలో చేపట్టే మహా ధర్నాకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.భారతి, ఐఎఫ్‌టీయూ నేతలు పి.వెంకటరత్నం, జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎండీఎం నిర్వాహకుల పొట్ట కొట్టొద్దు

శ్రీకాళహస్తి : ఏఎంపుత్తూరు నుంచి మధ్యాహ్న భోజనం పథకాన్ని నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళల పొట్ట కొట్టొద్దని సీఐటీయూ నాయకులు సూచించారు. బాధిత డ్వాక్రా మహిళలతో కలిసి స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ ఏఎంపుత్తూరు వేదికగా 20 మంది డ్వాక్రా మహిళలు పట్టణ వ్యాప్తంగా 14 ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలకు మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్లుగా ఎలాంటి రాజీలేకుండా ఎండీఎం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళల పొట్ట కొట్టేందుకు శ్రీకాళహస్తి విద్యాశాఖలో పని చేస్తున్న ఎంఈఓ స్థాయి వ్యక్తి కుట్ర చేస్తున్నాడంటూ ఆరోపించారు. డీఈవో స్పందించి ఆయనపై విచారణ జరపాలన్నారు.

పోర్టుల నిర్మాణంలో మాదే పైచేయి

– శాసన మండలిలో ఎమ్మెల్సీ మేరిగ


శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు: శాసన మండలిలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మంగళవారం తన గళం విప్పారు. అధికార పార్టీ బూజు దులిపారు. దుగ్గరాజపట్నం పోర్టు విషయంపై అధికార పార్టీ చేసిన విమర్శలను ఆయన దీటుగా తిప్పికొట్టారు.

ఆగిన గూడ్స్ రైలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): శేషాచల అటవీ ప్రాంతం, మాముండూరు సమీపంలో ఇంజిన్ మొరాయించడంతో జీఎస్‌డబ్ల్యూ గూడ్స్ రైలు ఆగిపోయింది. దీంతో పలు రైళ్లు రెండు గంటలు ఆలస్యంగా నడిచాయి. చెన్నై నుంచి గుంతకల్లు మీదుగా కర్ణాటకకు ఐరన్ లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు రేణిగుంట మండలం చైతన్యపురం సిగ్నల్ దాటగానే మిట్ట ప్రాంతం కావడంతో ఇంజిన్ నిలిచిపోయింది. రేణిగుంట రైల్వే అధికారులకు సమాచారం అందడంతో మరొక ఇంజిన్‌తో అతికష్టం మీద మాముండూరు రైల్వే స్టేషన్‌కు తరలించారు. దీని కారణంగా మంగళవారం రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, మరొక ట్రైను రెండు గంటలు ఆలస్యంగా నడిచాయి.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

–15 కేజీల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో రైల్వే పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట జీఆర్‌పీ ఎస్‌ఐ రవి తెలిపారు. ఆయన కథనం మేరకు.. రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని మూడో ప్లాట్ ఫారంపై సోమవారం రాత్రి అనుమానంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను తిరుపతి రైల్వే సబ్–డివిజినల్ పోలీస్ అధికారి ఎస్ఆర్ హర్షిత పర్యవేక్షణలో రైల్వే ఇన్‌స్పెక్టర్ పి.యతీంద్ర ఆదేశాలతో అదుపులోకి తీసుకొని పరిశీలించారు. వారి వద్ద 45 వేల విలువచేసే 15 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మంగళవారం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన మిల్టన్‌షేక్ (28), మదన్ మండల్ (39)ను అదుపులోకి తీసుకుని విచారించగా తమ బ్యాగుల్లో గంజాయి తీసుకువస్తున్నట్లు ఒప్పుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి, నెల్లూరు రైల్వే కోర్ట్ వారి ఎదుట హాజరు పరిచారు. ఐపీ ఎఫ్ సందీప్‌కుమార్, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ రమేష్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ రమేష్, కానిస్టేబుల్ ధనంజయ దాడుల్లో పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం


ఊంజల్ సేవలో భద్రావతి సమేత భావనారుషి స్వామివారు

నాగలాపురం: మండలంలోని భద్రావతి వీధిలో వెలసిన శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనారుషి స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీహరి వేకువజామునే స్వామివారిని సుందరంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు విఘ్నేశ్వర స్వామి పూజతో ప్రారంభించి, అనంతరం శ్రీ భావనారుషి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 7గంటలకు శ్రీ భావనారుషి స్వామివారి ఉత్సవమూర్తులను వివిధ రకాల పూలతో, ఆభరణాలతో సుందరంగా అలంకరించి ఉయ్యాల సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారిని మంగళవాయిద్యాల నడుమ వైభవంగా పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి స్వామివారిని దర్శించుకున్నారు. ఉభయదారులు గజలీలమ్మ, చొప్పా కుమారస్వామి, వారి కుటుంబ సభ్యులు, నారాయణ శెట్టి, పద్మశాలి యువకులు, ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ పర్యవేక్షకులు శ్యామల మధు, మునికృష్ణయ్య తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.